క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ

వాజేడు: ఎంపీడీఓగా శ్రీకాంత్ నాయుడు శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న విజయను జిల్లా పరిషత్‌కు రిపోర్టు చేయాని అధికారులు ఆదేశాలు జారీ చేయటంతో ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ నాయుడుకు ఎంపీడీఓ బాధ్యతలను అప్పగించారు.

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన వేణుగోపాల్‌ను గోండ్వానా సంక్షేమ పరిషత్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి, చంటి, బీమయ్య, రాజేష్, లక్ష్మయ్య, రాజేష్, తదితరులు ఉన్నారు.

ద్విచక్రవాహనం దగ్ధం



దగ్ధమవుతున్న ద్విచక్రవాహనం

వాజేడు: మండల పరిధిలోని చీకుపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో దిచక్రవాహనం దగ్ధమైంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. లక్ష్మీపురం గ్రామానికి చెందిన యువకుడు కోరం అన్వేష్ ద్విక్రచ వాహనంపై మండల కేంద్రానికి వస్తుండగా చీకు పల్లి గ్రామ సమీపంలో ద్విచక్రవాహన వేగం అదుపు చేయలేక కిందపడి పోయాడు. దీంతో అన్వేష్‌కు గాయాలు కావడంతో పాటు ద్విచక్ర వాహనానికి మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. అన్వేష్‌ను గ్రామస్తులు ఆటోలో వాజేడు వైద్యశాలకు తరలించారు.

లిస్టులో పేరు మాయం

- నాయకుల ఒత్తిళ్లతో తొలగించారని బాధితురాలి ఆవేదన



మాట్లాడుతున్న పద్మ

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని ఆరోవార్డుకు చెందిన ఒంటరి మహిళా పత్యం పద్మ ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని దరఖాస్తు చేసుకుంది. దీంతో ఆమె పేరును ఖరారు చేస్తు లిస్ట్ ప్రచురించారు. తీరా మరో లిస్ట్ వెలువడడంతో అందులో ఆమె పేరు మాయమైంది. అవాక్కైన పద్మ శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో తనకు జరిగిన అన్యాయాన్ని వివరించింది. తనకు ఖాళీ స్థలం ఉందని అందులో ఇంటి నిర్మించుకునేందుకు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు పద్మ తెలిపింది. అయితే ముందు వెలువడిన లిస్ట్‌లో 66 నంబర్‌లో తన పేరు ఉందని, తర్వాత వచ్చిన లిస్ట్‌లో ఆమె పేరు తొలగించి మరో పేరు చేర్చారని ఆవేదన వ్యక్తం చేసింది. తన ఖాళీ స్థలంపై పంచాయతీ కార్యదర్శి రమాదేవి, సిబ్బంది వెంకన్న వచ్చి సర్వే కూడా చేశారని తెలిపింది. తర్వాత రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో తన పేరు తొలగించినట్లు బాధితురాలు వాపోయారు. మంత్రి సీతక్క, కలెక్టర్ స్పందించి తనకు ఇళ్లు వచ్చే విధంగా చూడాలని వేడుకుంది.

అధ్వానంగా పల్లె ప్రకృతి వనాలు



పిచ్చి మొక్కలతో ఉన్న పల్లె ప్రకృతి వనం



ఎండిపోయిన మొక్కలు

- ఎండిపోతున్న మొక్కలు
- పట్టించుకోని అధికారులు

వెంకటాపురం(కె): పల్లెల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో మండలంలో 18 పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వాటిలో పలు రకాల మొక్కలను నాటారు. కానీ క్షేత్రస్థాయిలో పల్లె ప్రకృతి వనాల పరిస్థితి అధ్వాన్నంగా తయారైయింది. లక్షల రూపాయలు ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను పంచాయతీ అధికారులు సిబ్బంది పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఊరి చివర ఏర్పాటు చేసి వదిలేయడంలో మొక్కలు ఎండి పోయి పిచ్చి చెట్లకు నిలయాలుగా మారాయి. పల్లె ప్రకృతి వనాలపై అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో వాటిని పట్టించుకునే వారే కరువయ్యారు. మొక్కలు నీళ్లు పట్టివారే లేరని స్థానికులు వాపోతున్నారు. పల్లె ప్రకృతి వనాలపై ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పంచాయతీ సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యం వ్యవరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైన అధికారులు పల్లె ప్రకృతి వనాలపై దృష్టి సారించి మొక్కలు బతికించేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు..



పల్లె ప్రకృతి వనంలో మొక్కలు ఎండిపోతున్న అధికారులు, సిబ్బంది పట్టించుకోవటం లేదు. నాటిన మొక్కలకు నీరు లేక ఎండి పోతున్నాయి. ఇప్పటికైన అధికారులు దృష్టి సారించాలి. మొక్కలకు నీరు పట్టించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేయాలి.

- శ్రీను, వెంకటాపురం

పెనుగోలులులో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

వాజేడు: మండల పరిధిలోని పేనుగోలు గ్రామంలో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మధుకర్ గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రామంలో డ్రైడే, ఫ్రైడే కార్యక్రమం నిర్వహించి గ్రామంలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కోటిరెడ్డి, వెంకటరమణ, రాజేశ్వరి, చిన్న వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

వాజేడు: మండల పరిధిలోని కృష్ణాపురంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పైపూరి బీమేశ్వరావుకు బీఆర్ఎస్ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. బీమేశ్వరావు కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో స్పందించిన బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పెనుమాల్లు కృష్ణారెడ్డి, నూగూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోదబోయిన బుచ్చయ్య రూ.పది వేలు, 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తగట్టు సాంబమూర్తి, ముడిగ తిరుపతి, పూనెం నాగేంద్ర, యాలం చిట్టిబాబు, కృష్ణయ్య, లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

ములుగు రూరల్: వర్షాకాలంలో పశువకులకు వచ్చే వ్యాధులు గొంతువాపు, జబ్బవాపు రాకుండా టీకాలు వేయించాలని ఎల్ఎస్ఏ ఆకుల నరేష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రేమ్‌నగర్‌లో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న సీజనల్ వ్యాధుల నివారణ టీకాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది చరణ్, పాడి రైతు జంగిలి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

గోవిందరావుపేట: మండలంలోని చల్వాయిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి పార్టీ సీనియర్ నాయకుడు పైడాకుల కృష్ణమూర్తి హాజరై శంకుస్థాపన చేశారు. అధికారులు తెలిపిన కొలతల ప్రకారం ఇళ్లు నిర్మాణం చేపట్టాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుధాకర్, నాటలక్ష్మి, అనిల్‌యాదవ్, హరిప్రసాద్, ప్రకాష్, సుదర్శన్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రామసభలు

మల్లూర్: మండలంలోని దుబ్బపేట, అన్నాస్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ గ్రామసభలో వివిధ భూ సమస్యలపై రైతుల నుంచి 197 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. దుబ్బపేటలో 58, అన్నాస్‌పల్లిలో 139 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఏఎస్ఓ శివ, సిబ్బంది పాల్గొన్నారు.

రేగొండ(కొత్తపల్లిగోరి): భూ సమస్యల పరిష్కారం కోసం మండలంలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ లక్ష్మీరాజయ్య అన్నారు. శుక్రవారం కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 287 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది డిప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ రజాక్, నేత వెంకటేష్, పకిడే రాజయ్య, మధు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని బ్రహ్మణపల్లి, కన్నెపల్లి మెట్‌పల్లి గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో శుక్రవారం 123 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ వై.రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేర్వేరుగా డీటీ కృష్ణ, ఆర్ఐ జగన్‌మోహన్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సౌభాగ్యవతి, జూనియర్ అసిస్టెంట్ రఘు, బాలరాజు, భార్గవి, సంపత్, శ్యామ్, రాజబాపు, మహేందర్, రాజబాపు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు అమ్మితే చర్యలు



వెంకటాపురం(ఎం): తనిఖీ చేస్తున్న అధికారులు



గోవిందరావుపేట: మాట్లాడుతున్న అధికారులు

- టాస్క్‌ఫోర్స్ సీఐ రమేశ్

వెంకటాపురం(ఎం): నాసిరకం విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ సీఐ రమేశ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తహసీల్దార్ గిరిబాబు, ఎస్సై జక్కుల సతీష్, ఏఓ శైలజతో కలిసి ఆయన తనిఖీ చేశారు. అనంతరం రైతు వేదికలో రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినట్లయితే తప్పకుండా సంబంధిత డీలర్ల వద్ద రశీదులు తీసుకోవాలని రైతులకు సూచించారు. గ్రామాల్లోకి వచ్చి విత్తనాలు అమ్మే దళారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు.

గోవిందరవుపేట: రైతులకు నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ రవీందర్ అన్నారు. శుక్రవారం ఎరువులు, విత్తనాల షాపుల యజమానుతో మండల వ్యవసాయ శాఖ అధికారి జితేందర్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐ రవీందర్ హాజరై మాట్లాడారు. వానకాలం సీజన్‌లో రైతులకు విత్తనాలు ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు. రైతులకు విక్రయించిన విత్తనాలకు, ఎరువులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు.

కరాటేతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో నాయకులు

- ఎంఈఓ కొయ్యడ మల్లయ్య

ఏటూరునాగారం: కరాటేతో విద్యార్థుల్లో ఎంతో ఆత్మస్థైర్యం కలుగుతుందని ఎంఈఓ కొయ్యడ మల్లయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మర్ క్యాంపు, సీఎం కప్‌లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆడ పిల్లలు ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలన్నారు. విద్యతోపాటు కరాటే, క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్స్ అబ్బు, హుస్సేన్, రోడ్డు రవాణా సంస్థ డైరెక్టర్ వసంత శ్రీనివాస్, రామాలయం గుడి చైర్మన్ అలువాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖలీల్, గౌస్, పాఠశాల, హాస్టల్ సిబ్బంది చందర్, ఎల్లయ్య పాల్గొన్నారు.

వీవర్స్ కాలనీ ఓటర్లను విభజించొద్దు



వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ములుగు రూరల్: ములుగు మున్సిపల్ పరిధిలోని వీవర్స్‌కాలనీవాసుల ఓట్లను విభజించొద్దని కాలనీవాసి బాసాని రాంమూర్తి కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సంపత్‌కు వినతిపత్రం అందజేశారు. ములుగులో వీవర్స్‌కాలనీ రెండు వార్డులుగా విభజించడంతో అభివృద్ధికి దూరమయిందని అన్నారు. వార్డుల విభజనలో భాగంగా వీవర్స్‌కాలనీ ఓట్లను ఏడోవ వార్డులో, 19 వార్డులో సర్దుబాటు చేశారని అన్నారు. మున్సిపాలిటీలో వీవర్స్‌కాలనీ ఒకే వార్డులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాజమల్లు, సదానందం, భాస్కర్, రవీందర్, ఎల్లావుల అశోక్, వంగ రవియాదవ్, పొడాల ఓంప్రకాశ్, శ్రీను, సారయ్య, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

చిట్యాల: భూమికి పట్టాలు చేయిస్తామని దళారులు చెప్పిన మాటాలను ప్రజలు నమ్మి మోసపోవద్దని తహసీల్దార్ షేక్ ఇమామ్ బాబా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులో రైతులకు సంబంధించిన భూ సమస్యలను అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని డబ్బులు ఖర్చు అవుతుందని చెప్పి దళారులు ఇబ్బంది పెడతారని అలాంటి వారి మాటాలు నమ్మవద్దని తెలిపారు. సమస్యలు ఉంటే రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవచ్చవని అన్నారు. నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో కూడా దరఖాస్తు ఇవ్వొచ్చని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ఏటూరునాగారం: శంకరాజుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



గోవిందరావుపేటలో..

- తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్

వాజేడు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని నాగారం ఉన్నత పాఠశాలలో శుక్రవారం జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హెచ్ఎం సోయం ఆనందరావు ప్రారంభించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేసి అత్యధికంగా అడ్మిషన్లు సాధించాలని అన్నారు. అనంతరం నూతన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మధుకర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు చెన్నం ఎల్లయ్య, ఉపాధ్యాయులు స్వరూప్ సింగ్, చల్లగురుగల మల్లయ్య, శ్రీకాంత్, రాజ్యలక్ష్మి, కుమార్ బాబు, శ్రీరంగం ఉన్నారు.

గోవిందరావుపేట: బడిఈడు పిల్లాలను బడిలో చేర్పించాలని ఎంఈఓ దివాకర్ అన్నారు. శుక్రవారం మండంలో జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మడల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సోమిరెడ్డి, రఘురాం, శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శంకర్ ఉన్నారు.

ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించాలి

ఏటూరునాగారం: మండలంలోని శంకరాజుపల్లి పాఠశాలలో ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సంధ్యారాణి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్క తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో వారి పిల్లలను చేర్పించి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్ గ్రామంలోని పిల్లల ఇంటికి వెళ్లి బడిలో చేర్పించాలని బడిబాట కరపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మురళి, సత్యం, లలిత, భాగ్యవతి, మమత, స్రవంతి, సరిత, సుమన్ పాల్గొన్నారు.



మంగపేటలో..

మంగపేట: ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఎంఈఓ పాదెం మేనక అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగపేట, నర్సింహాసాగర్‌లో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. తహసీల్దార్ రవీందర్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నెరవేరుతున్న సొంతింటి కల

- కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- సకాలంలో బిల్లుల చెల్లింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



నిర్మాణం తుది దశకు చేరుకున్న ఇందిరమ్మ ఇల్లు

టేకుమట్ల: నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను కేటాయించడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిరుపేదలందరికీ డబుల్ బెడ్రూంలను నిర్మిస్తామని చెప్పి మండలంలోని 24 గ్రామ పంచాయితీల్లో కేవలం రాఘవాపూర్, గర్మిళ్లపల్లి, ద్వారకపేట, రామకిష్టాపూర్(వి), ఎంపేడు గ్రామాలకు మాత్రమే అనుమతులు ఇచ్చి నిర్మించారు. ఆ గ్రామాల్లో కూడా గర్మిళ్లపల్లి, రామకిష్టాపూర్, రాఘవాపూర్ మినహా ఎంపేడు, ద్వారకపేటలో అసంపూర్తిగా వదిలేయడంతో ఇప్పటికీ అలంకారప్రాయంగానే మిగిలాయి. కాగా ఎంపేడులో ఇళ్లను పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే ప్రత్యేక నిధులను కేటాయించడంతో తుది దశకు చేరుకున్నాయి.

నియోజకవర్గానికి 3500 ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్లలో మొదటిగా మోడల్ విలేజ్‌గా టేకుమట్లను ఎంపిక చేయగా 35 మంది నిర్మించుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చారు. అనుమతి పత్రాలను సైతం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అందించారు. ఇప్పటి వరకు 21 మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో రానున్న రోజుల్లో నిరుపే దలందరికీ ఇళ్లు రానున్నాయి.

నాలుగు దఫాలుగా బిల్లులు..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో బేస్‌మెంట్ వరకు పూర్తి చేసిన వెంటనే అధికారులు ఏఐ టెక్నాలజీతో ఫొటోలను అప్లోడ్ చేయగానే వారం రోజుల వ్యవధిలోనే రూ.1లక్ష నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతోంది. రూఫ్‌లెవల్ గోడల వరకు నిర్మాణాలు పూర్తి చేస్తే రూ.1లక్ష, స్లాబ్ పూర్తి అయ్యాక రూ.2లక్షలు, ప్లాస్టరింగ్, డోర్ ఫిట్టింగ్, కలర్ వాషింగ్ పూర్తి అయ్యాక చివరి బిల్లు రూ.1లక్ష అందిస్తారు. ఇలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఎంత వేగంగా పూర్తి చేస్తే బిల్లులు కూడా అంతే వేగంగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి నిర్మాణం పూర్తయింది



మండల కేంద్రంలోని మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో మొదటగా నిర్మాణం పూర్తి అయిన ఇళ్లు నాదే. ప్రస్తుతం ప్లాస్టరింగ్ చివరి దశకు చేరుకుంది. ఇంటి నిర్మాణం కొనసాగుతుంటే బిల్లులు రావడం ఆనందంగా ఉంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అధికారులే ఇంటి నిర్మాణ ఫొటోలను తీసుకుని బిల్లులు చెలిస్తున్నారు.

- మాచర్ల రాజేశ్, లబ్ధిదారుడు, టేకుమట్ల

ప్రోత్సహిస్తున్నాం..



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకునేందుకు ప్రోత్సహిస్తున్నాం. నిర్మాణాలను ప్రభుత్వ నిబంధనల మేరకు పూర్తి చేయగానే నిర్మాణాల ఫొటోలను అప్లోడ్ చేసి బిల్లులు వచ్చేలా కృషి చేస్తున్నాం. అలాగే నిర్మాణాల్లో జాప్యం జరుగకుండా ఇసుకు అనుమతులను జారీ చేస్తున్నాం. లబ్ధిదారులు ఎక్కడా ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- అడగాని సాంబశివుడు, పంచాయతీ కార్యదర్శి, టేకుమట్ల

విద్యార్థిని ఆత్మహత్య

మంగపేట : మండలంలోని కమలాపురంలో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థిని అల్లం నిఖిత (14) ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో నివాసముంటున్న అల్లం తిరుపతమ్మను కొన్నేళ్ల క్రితం భర్త వదిలేసి వెళ్లిపోయాడు. దీంతో ఆమె స్థానికంగా ఉన్న ఓ పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తు కూతురు నిఖితతో కలిసి జీవనం సాగిస్తోంది. శుక్రవారం తల్లి పనికి వెళ్లగా, నిఖిత కుటుంబ సమస్యలతో పాటు ఆర్థిక పరిస్థితుల కారణంగా తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్ రాసి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లి తన కూతురు నిఖిత ఫ్యానుకు ఉరేసుకుని వేలాడుతూ కనిపించడంతో బోరున విలపించింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహన్ని ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు.